సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



సదరం తిప్పలు
సదరం స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు శుక్రవారం రాత్రినుంచే మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాచారు.
- 9లో ▸



దర్జాగా నొక్కేశారు
విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల విషయంలోనూ కొందరు హెచ్‌ఎంలు చేతివాటం ప్రదర్శించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /16.8

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన పరీక్షకు 767 విద్యార్థులకు గాను 754 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 781 విద్యార్థులకుగాను 718 మంది పాల్గొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

7, 9 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 7, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ఆర్థికం, ప్రణాళిక, 9న సాంఘిక, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ శాఖలపై స్థాయీ సంఘ సమావేశాలుంటాయని పేర్కొన్నారు.

10న జెడ్పీ సర్వసభ్య సమావేశం

జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 10న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో సభ్యులు పాల్గొనాలని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులకు ఆర్థిక ప్రణాళిక తయారు, ఆమోదించడం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కూతురు పుట్టిన రోజే.. ప్రమాదంలో తండ్రి దుర్మరణం



హన్మండ్లు (ఫైల్)

బాన్సువాడ : కూతురు పుట్టిన రోజు కుటుంబ సభ్యులంతా కలిసి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తాపడి తండ్రి మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సబ్బిడి హన్మండ్లు (53) తన కూతురు కృష్ణవేణి పుట్టిన రోజు వేడుకను దైవ సన్నిధిలో జరపాలనుకున్నారు. శనివారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆటో బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండ పైనుంచి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న హన్మండ్లుతో పాటు కూతురు కృష్ణవేణి, భార్య జయశ్రీ, అత్త గంగవ్వ, డ్రైవర్ దత్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అందరినీ నిజామాబాద్ తరలిస్తుండగా హన్మండ్లు మార్గమధ్యలో మృతి చెందాడు. మిగతా వారు చికిత్స పొందుతున్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులనుంచి స్కాలర్‌షిప్ కోసం సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. స్కాలర్‌షిప్ కోసం కొత్త దరఖాస్తులతోపాటు రెన్యువల్ కోసం మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జి.రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల కోసం 7న స్పెషల్ డ్రైవ్

కామారెడ్డి క్రైం: ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాల కోసం 7న స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్‌లో షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్‌గా పనులకు డిమాండ్ ఉందని పేర్కొన్నారు. 21–45 ఏళ్లలోపు వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై, ఆయా రంగాలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 7 న కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.

సర్కారు బడుల్లో భావి శాస్త్రవేత్తలు!

సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు అద్భుతాలు చేస్తున్నారు. కొత్తకొత్త ఆవిష్కరణలతో జిల్లా, రాష్ట్ర స్థాయిలలోనే కాకుండా జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలోనూ సత్తా చాటుతున్నారు. సృజనాత్మక శక్తితో అబ్బురపరిచే పరికరాలను తయారు చేసి అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాకు చెందిన విద్యార్థులు రూపొందించిన 20 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో స్థానం సంపాదించుకున్నాయి. జిల్లా విద్యార్థుల ప్రతిభపై సండేస్పెషల్..

– సాక్షి, కామారెడ్డి



విజయవాడలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రాజెక్టు గురించి వివరిస్తున్న జిల్లా విద్యార్థులు

- అబ్బురపరిచే పరికరాలు తయారు చేస్తున్న విద్యార్థులు
- ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో గుర్తింపు

సండే స్పెషల్

సృజనాత్మక శక్తి ఏ ఒక్కరి సొంతమో కాదు.. వెన్నుతట్టి ప్రోత్సహించేవారుంటే ఎవరైనా అద్భుతాలు చేయగలరు. ఏ విషయంలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు సర్కారు బడి పిల్లలు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలోనూ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలో గతనెల 27 నుంచి ఈనెల 1 వ తేదీ వరకు సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన రెండు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తాము రూపొందించిన పరికరాలను ప్రదర్శించి నిర్వాహకుల అభినందనలు అందుకున్నారు. అలాగే కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ 'లర్న్ ఫిజికల్ సైన్స్ విత్ ఫన్ గేమ్స్' పేరుతో రూపొందించిన టీఎల్‌ఎం అంశాలను ప్రదర్శించి ద్వితీయ స్థానం పొందారు.

ఏటా పదుల సంఖ్యలో ప్రదర్శనలు



జిల్లా అధికారుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల చొరవతో సైన్స్ ఫెయిర్స్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పైర్ వంటి వాటిలో జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్నారు. గైడ్ టీచర్స్ సహకారంతో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

– సిద్దరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే కారు కదిలేది..



ప్రాజెక్టుతో విద్యార్థి, టీచర్

రాజంపేట మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సింధూజ 'డ్రైవింగ్ లైసెన్స్ బేస్డ్ ఇంజన్ ఇగ్నిషన్ సిస్టం' రూపొందించింది. ఈ పరికరాన్ని అమర్చితే.. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు డ్రైవర్ సీట్లో ఉంటేనే వాహనం కదులుతుంది. ఈ పరికరంలో డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను సేవ్ చేయాలని, ఆ తర్వాత ఆ వ్యక్తి నడిపితేనే వాహనం కదులుతుందని విద్యార్థిని సింధూజ వివరించింది. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందని, దొంగలు వాహనాన్ని చోరీ చేయలేరని పేర్కొంది. ఈ ప్రదర్శనను సైతం విజయవాడ సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు. గైడ్ టీచర్‌గా పాఠశాల సైన్స్ టీచర్ జి.అశోక్‌రావు వ్యవహరించారు.

హెల్మెట్ ధరిస్తేనే బైకు స్టార్ట్..



రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి నెనావత్ బబ్లూ వినూత్నంగా ఆలోచించి పరికరాన్ని రూపొందించాడు. హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యేలా పరికరాన్ని తయారు చేశాడు. అలాగే ఆల్కహాల్ తీసుకుంటే కూడా బైక్ స్టార్ట్ అవ్వదు. సీట్ బెల్ట్ పెట్టుకుంటేనే ఫోర్ వీలర్ వాహనం స్టార్ట్ అవుతుంది. శ్రీనివాస్ అనే గైడ్ టీచర్ సహాయంతో ఇతడు రూపొందించిన 'ఇంటిలిజెంట్ హెల్మెట్ సిస్టం'ను విజయవాడ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించాడు. ప్రదర్శన నిర్వాహకులు ఈ ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థిని అభినందించి, ప్రోత్సాహక బహుమతి అందించారు.

పక్షులపై అధ్యయనం..

ఇటీవల ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో మందాపూర్ పాఠశాల విద్యార్థులు శ్రీనిధి, సాయి క్రిష్ పాల్గొన్నారు. పర్యావరణం, పక్షుల అధ్యయనంపై వీరి ప్రదర్శన జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది. మానవ తప్పిదాల వల్ల రోజురోజుకు పక్షి సంపద క్షీణిస్తోందని, త్వరలోనే 236 పక్షులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని వీరు ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ పక్షి జాతులను సంరక్షించడానికి కృషి చేయాలని పిలుపునిస్తున్నారు.



ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థి శ్రీనిధి

చిత్తశుద్ధితో పనిచేయాలి

- 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తాం
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 8 న ఓటరు తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులను అన్నింటినీ ఈనెల 7వ తేదీలోగా పరిష్కరించి తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు నోడల్ అధికారులను మార్చామన్నారు. నియమితులైన వారు ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారంలో పురోగతి సాధించామన్నారు. విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటిని ప్రారంభించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏవైనా మరమతులు, నిర్వహణ ఖర్చులు ఉన్నట్లయితే నియోజకవర్గ ప్రత్యేక నిధులను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతున్న మరో రెండు గ్యారెంటీలకు సంబంధించిన అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ నూతన డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, మన్నె ప్రభాకర్, భుజంగం, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్, పశు సంవర్థక శాఖాధికారి సింహారావు, మత్స్య శాఖ ఏడీ వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులను నియమించాం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. శనివారం ములుగు కలెక్టరేట్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులు, కలెక్టర్లతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై సమీక్షించారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లకు సూచించారు. ఈనెల 7 నుంచి 14 వరకు పారిశుధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తాగు నీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డుల నిర్వహణ, వైకుంఠధామాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్‌డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ మురళి, మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను శనివారం ఎంపిక చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్ అండర్–8, 10, 12, 14 బాలబాలికల విభాగాలలో నిర్వహించిన పోటీలకు భారీ స్పందన వచ్చిందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపికలు నిర్వహించి 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వీరు ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరేష్‌రెడ్డి, వెంకటేశ్వరగౌడ్, వెంకటి, దత్తాద్రి, నవీన్, శ్రీనివాస్, మధుసూదన్, వీణ, గౌమతి, సంజీవ్, శివాగౌడ్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

తాన్‌సింగ్, సీహెచ్.సాత్విక్, పి.అరాధ్య, ఎస్.కృతిక, జె.అధ్య, ఎం.రాంచరణ్, ఎ.భార్గవ్‌రెడ్డి, జె.రఘువీర్‌గౌడ్, డి.వీహన్‌రెడ్డి, బి.వేదశ్రీ, బి.రైనా, ఎస్.సాత్విక్, కె.రాంచరణ్, బి.శ్రావణ్‌కుమార్, కె.భవాని, కె.మమత, ఎం.పవిత్ర, జి.ప్రణీత, జె.ప్రవీణ్, బి.విజయ్‌కుమార్, ఎల్.యోగి, కె.సునీత, డి.సంధ్య, వి.కార్తీక్.

వీగిపోయిన అవిశ్వాసం!

- అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- నెల రోజుల అనంతరం వీడిన ఉత్కంఠ



వినీత, మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్: నెల రోజులుగా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో.. ఎట్టకేలకు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. పండిత్ వినీతపై సొంత పార్టీ అయిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తిరుబాటు బావుటా ఎగరవేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ మేరకు కలెక్టర్ జనవరి 4న అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిసెంబర్ 29న ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆర్మూర్ మున్సిపాలిటీలో నమోదు చేయించుకున్నారు. అయితే ఈయనకు ఓటు హక్కు విషయంలో అధికారులు స్పష్టతనివ్వలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం సమావేశంలో 24 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తగా, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాత్రం చేతు ఎత్తలేదు. కాగా 24 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లేనని అధికారులు ప్రకటించారు. అయితే మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే ఓటుతో కలిపి 37 ఓట్లు ఉండగా 2/3 కోరం అంటే 25 మంది ఓటర్లు చేతులు లేపి మద్దతు తెలిపినప్పుడే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అవుతుంది. ఈ సాంకేతిక అంశం ఆధారంగా.. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చేతు ఎత్తకపోవడంతో తీర్మానం వీగిపోయినట్లుగా ప్రకటించాలని పండిత్ వినీత వర్గీయులు కోర్టుతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. పూర్వాపరాలు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లేనని ప్రకటించింది. అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించిన ఆర్డీవోకు స్పష్టత లేని కారణంగా గందరగోళ పరిస్థితి నెలకొన్నందున ఆర్డీవో వినోద్‌కుమార్‌ను వివరణ కోరాల్సిందిగా కలెక్టర్‌కు సీడీఎంఏ సూచినట్లు సమాచారం.

పట్టణంలో సంబురాలు

ఆర్మూర్‌టౌన్: చైర్‌పర్సన్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటన రావడంతో ఆమె వర్గీయులు పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, మామిడిపల్లి, పెర్కిట్ చౌరస్తాలో పటాకులు కాల్చారు.

రాకేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలకు షాక్...

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, తాజా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఇద్దరికీ పండిత్ వినీత వర్గం షాక్ ఇచ్చినట్లుగా అయ్యింది. వీరిద్దరూ చైర్ పర్సన్ వినీతను గద్దె దింపడం కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ అధికార పార్టీ అండతో తిరిగి చైర్ పర్సన్ పీఠాన్ని దక్కించుకున్న తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అక్కడలా.. ఇక్కడిలా..

- సింగిల్ విండోలలో ఎరువుల ధరలలో వ్యత్యాసాలు
- ముత్యంపేటలోకన్నా జంగంపల్లిలో బస్తాపై రూ. 50 అదనం
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు
- వేతనాల కోసమే ఎమ్మార్పీకి అమ్ముతున్నామన్న సీఈవో



ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

భిక్కనూరు: జంగంపల్లి సింగిల్ విండోలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సమీపంలోని సహకార సంఘంలోకన్నా ఎక్కువ ధరకు ఎరువుల బస్తాను విక్రయిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ, ముత్యంపేట సింగిల్ విండోల్లో 20:20:13 ఎరువు బస్తాను రూ. 1,150కి విక్రయిస్తున్నారు. అదే ఎరువుల బస్తాను జంగంపల్లి సింగిల్ విండోలో రూ. 1,200లకు అమ్ముతున్నారు. శనివారం పలువురు రైతులు ఈ విషయమై సీఈవో రమేశ్‌ను నిలదీశారు. తమ వేతనాల విషయంలో సింగిల్‌విండోపై అధిక భారం పడుతున్నందున తక్కువకు ఇవ్వడం లేదని, ఎమ్మార్పీకే అందిస్తున్నామని సీఈవో సమాధానమిచ్చారు. ఈ విషయమై రైతులు విండో చైర్మన్ సిద్దరాములుతో మాట్లాడగా.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయిస్తున్నామన్నారు. అయితే ఎరువులపై బస్తాకు రూ. 50 ఎక్కువ తీసుకుంటున్నట్లుగానే వద్దను కూడా అధిక ధరకు ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రశ్నించారు. తీసుకున్న ధరకు రసీదు కూడా ఇస్తున్నామని, ఏం చేస్తారో చేసుకోండని విండో చైర్మన్ కటువుగా సమాధానమిచ్చారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితిలో బస్తాకు రూ. 1,200 చెల్లించి ఎరువులు కొనుగోలు చేశారు.

నేడు గురుకుల కళాశాలల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ(సీవోఈ) కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం ఆదివారం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గురుకులాల ఆర్‌సీవో అలివేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, కొయ్యగుట్ట/తక్కడపల్లి, పెద్దకొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల, పెద్ద ఎక్లార, బాన్సువాడ/బోర్లాంలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

జహీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరేద్దాం

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

బాన్సువాడ: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకోసం పార్టీ కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శనివారం బాన్సువాడ, బీర్కూర్‌లలో బీజేపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా సుమారు 70 రోజుల సమయం ఉందన్నారు. ప్రతి కార్యకర్త తమ బూత్ స్థాయిలో భారీ మెజారిటీ కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యకర్తల కష్టాన్ని పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి బద్దం మహిపాల్‌రెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ కోకన్వీనర్ భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, చీకట్ల రాజు, సాయిబాబా, భాస్కర్‌రెడ్డి, సాయికిరణ్, గంగారాం, దత్తు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన కంట్లికుంట్ల వెంకవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.వెంకవ్వ కుమారుడు ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆమె వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయం సాక్షి దినపత్రిక గుర్తుచేసింది.వెంకవ్వ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముగిసిన ఉపాధి ప్రజావేదిక

గాంధారి: మండల పరిధిలోని 44 పీజీ పరిధిల్లో 2022–23లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేసి నిర్వహించిన ప్రజా వేదిక ముగిసినట్లు ఎంపీడీవో సతీశ్ శుక్రవారం తెలిపారు. గురువారం అర్ధరాత్రి వరకు ప్రజా వేదిక నిర్వహించినట్లు చెప్పారు. మస్టర్లతో అవకతవకలు, వైకుంఠధామం అసంపూర్తి పనులపై డీఆర్డీవో సాయన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. దుర్వినియోగమైన డబ్బులు రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్ : గంగపుత్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, భీష్మసేవా పరివార్ క్యాలెండర్లను శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజన్న, కేపీ అనిల్‌కుమార్, భీష్మ సేవా పరివార్ సంఘం అధ్యక్షుడు కే.ఎల్లయ్య, కార్యదర్శి పాక రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తలమడ్లలో 'స్వయంపాలన'

రాజంపేట : రాజంపేట మండలం తలమడ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దమ్మాటి భిక్షపతి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు స్థల పరిశీలన చేశారు. ఎన్నికల సమయంలో బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రయాణికులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు విన్నవించగా ప్రస్తుతం మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. గణపతి ఉపాసకులు సంజీవ్‌రావ్ శర్మ స్థలాన్ని పరిశీలించారు.

కబ్జా కోరల్లో హైదర్ కుంట!

- ఆక్రమణలకు గురైన కాలువలు
- నష్టపోతున్న ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు



నీరు లేక వెలవెలబోతున్న హైదర్ కుంట

బాల్కొండ: కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కాలువలను సైతం కబ్జా చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి అండగా ఉండాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాల్కొండ మండల శివారులోని హైదర్ కుంటకు కాలువల ద్వారా నీరు అందక పోవడంతో వెలవెలబోతుంది. ఈ కుంట ఆధారంగా 120 ఎకరాలకు సాగు నీరు అందడమే కాకుండా చుట్టుపక్కల భూముల్లో భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడుతుంది. కానీ ఈ కుంటకు నీటి సరఫరా చేసే కాలువలు కబ్జాకు గురై పూడ్చి వేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆర్మూర్ మండలం ఫత్తెపూర్ శివారు గుండా ప్రవహించే నిజాంసాగర్ కాలువ ద్వారా ఈ కుంటకు ఉప కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ప్రధాన కాలువ నుంచి కుంట వరకు ఉన్న ఉప కాలువలు కబ్జాకు గురయ్యాయని ఇటీవల బాల్కొండ తహసీల్దార్‌కు ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వానకాలంలో మాత్రమే కుంటలో నీరు వచ్చి చేరుతుంది. కానీ యాసంగిలో మాత్రం సీజన్ ప్రారంభం వరకే చుక్క నీరు లేకుండా ఎండిపోతుంది. దీంతో ఆయకట్టుకు నీరు అందకుండపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణకు గురైన కాలువలను వెలికి తీసి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కుంట ఆక్రమణ..

హైదర్ కుంట సుమారు 8 ఎకరాల విస్తీర్ణంతో ఉంటుంది. కుంటకు తూములు ఉన్నాయి. మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా పూడికతీత, తూముల మరమ్మతులను అధికారులు చేపట్టారు. కానీ కుంటలో నీరులేక పోవడంతో కుంట చుట్టూ ఉన్న వారు కుంటను కబ్జాకు పాల్పడుతున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కుంట విస్తీర్ణం 5 ఎకరాలు కూడా లేదని వినిపిస్తోంది. నీరు లేక ఓ వైపు ఆయకట్టు రైతులు అవస్థలు పడుతుంటే కుంట కబ్జా కావడం రైతులకు మూలిగేనక్క మీద తాటి కాయపడ్డట్లు అవుతుంది. సంబంధిత అధికాలు పూర్తి సర్వే నిర్వహించి కుంట భూమిని కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కాలువను మూసివేశారు



హైదర్ కుంటలకు నీరు వచ్చే చిన్న కాలువను పైన ఉన్న వారు దున్నుకోవడంతో మొత్తం మూసివేశారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పంటలకు నీరు అందకుండపోతుంది. పెద్దసార్లు ఎలాగైన ఆయకట్టు రైతులకు నీళ్లందేలా చూడాలి.

– నర్సయ్య, ఆయకట్టు రైతు, బాల్కొండ

రోగులకు మెరుగైన సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భిక్కనూరు : వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలను అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పులన్నీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే అయ్యేలా వైద్యసిబ్బంది ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు అవసరమైన మందులన్ని ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదుపరి పీహెచ్‌సీలో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను పర్యవేక్షించారు. 130 మంది స్త్రీలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఐదుగురి రక్త నమూనాలను సేకరించారు. వైద్యులు ఆదర్శ, యోమిమా, ఆరోగ్యవిస్తారణాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు మెరుగుపర్చాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : గ్రామగ్రామాన ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని నెమ్లిలో వెల్‌నెస్ సెంటర్‌లో ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు.హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ గర్భవతుల నమోదు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, హెచ్‌ఐవీ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించారు. చిన్నారులకు ఎంఆర్‌డోస్, కంప్లీట్ ఇమ్యునైజేషన్, బూస్టర్ డోస్‌లు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలేఖ, రోహిత్, జిల్లా ఏయిడ్స్ కంట్రోల్ మేనేజర్ సుధాకర్, సీహెచ్‌వోలు దస్తీరాం, దయానంద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారని రాస్తారోకో



ధర్నా చేస్తున్న చిన్నపోతంగల్ గ్రామస్తులు

గాంధారి(ఎల్లారెడ్డి) : జీపీ భవన స్థలంతో పాటు గ్రామంలో పలు దారులను ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ మండల పరిధిలోని చిన్న పోతంగల్ గ్రామస్తులు శుక్రవారం గాంధారి–బాన్సువాడ రహదారిపై చిన్నపోతంగల్ స్టేజీవద్ద ధర్నా, రాస్తారోకో చేశారు. చిన్న పోతంగల్ గ్రామానికి చెందిన నాయకుడు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుత బీజేపీ రైతు మోర్చా నాయకుడు పోతంగల్‌కిషన్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు గ్రామం నుంచి 2 కి.మీ కాలినడకన వచ్చి ప్రదాన రహదారిపై ధర్నా చేశారు. జీపీల పునర్విభజనలో భాగంగా పోతంగల్ కలాన్ జీపీ నుంచి విడిపోయి చిన్న పోతంగల్ (కుర్దు) విడిపోయి జీపీ ఏర్పాటైంది. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో జీపీ కార్యాలయాన్ని నిర్వహించారు. నూతన పంచాయతీ భవనం కోసం నిధులు మంజూరు కాగా కమ్యూనిటీ హాల్‌ను కూల్చేసి అదే స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టారు. అయితే సదరు వ్యక్తి జీపీ భవనం నిర్మిస్తున్న స్థలం తన సొంత పట్టా భూమి అంటూ గ్రామస్తులతో వాదిస్తూ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు ఏకమై భవననిర్మాణాన్ని కొనసాగిస్తూ స్లాబ్ వేశారు. భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు కాకుండా తన పలుకుబడిని ఉపయోగించి సంబంధిత అధికారులకు పిర్యాదు చేస్తూ అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత వ్యక్తి గ్రామంలో పలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని, గ్రామంలో ఓ ఆలయానికి వెళ్లే దారిని కూడా ఆక్రమించాడని ఆరోపించారు. అధికారులు జోక్యం చేసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నాను విరమింప చేశారు. అనంతరం తహసీల్దార్ జానకికి వినతిపత్రం ఇచ్చారు.

చిన్నారిని బతికించారు..

- 'సాక్షి' కథనంతో స్పందించిన దాతలు
- ఆపరేషన్ విజయవంతం కావడంతో తల్లిదండ్రుల హర్షం



ఆపరేషన్ తర్వాత తల్లిదండ్రులతో చిన్నారి

మాచారెడ్డి: నిరుపేద కుటుంబానికి 'సాక్షి' కథనం అండగా నిలిచింది. మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామానికి చెందిన రాము, రజని దంపతుల కూతురు ప్రసన్న(5) గుండెకు చిల్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 18 నెలలు చికిత్స నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయాలని చెప్పారు. చేతిలో చిల్లి గవ్వ లేని ఆ తల్లిదండ్రుల బాధను సాక్షి 2022 ఏప్రిల్ 3న ప్రచురించింది.

దీంతో స్పందించిన దాతలు రూ.2.5 లక్షల వరకు విరాళం అందజేశారు. ఈ డబ్బులతో 18నెలలుగా చికిత్స అందించి, చిన్నారికి ఐదేళ్లు నిండిన అనంతరం గత నెల 22న కేర్ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేశారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వార్త కథనంతో చిన్నారికి జీవం పోసిన సాక్షికి, విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలక మండలికి సన్మానం



మాచారెడ్డి : సర్పంచుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండలంలోని గజ్యా నాయక్ తండా సర్పంచ్ హంజి నాయక్, ఉప సర్పంచ్ కిషన్, వార్డు సభ్యులను శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్ రావు, నాయకుడు భాస్కర్‌నాయక్ శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లు గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

సీఐకి సన్మానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సీఐగా బదిలీపై వచ్చిన రవీందర్‌నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్‌గౌడ్, భూమయ్య, సందీప్, బంజారా సంఘం నాయకులు ఓంకార్, సురేష్ శుక్రవారం శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో సాగర్

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని శేఖాపూర్ గ్రామ హరిత నిధి వన నర్సరీని శుక్రవారం బాన్సువాడ సబ్ డీఎఫ్‌వో సాగర్ పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో శేఖాపూర్ హరిత నిధి నర్సరీలో 50 వేల మొక్కలు పెంచుతున్నారు. సదరు నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. జుక్కల్, పిట్లం రెంజ్ అధికారులు సంతోష, సంజయ్‌గౌడ్, డిప్యూటీ రేంజ్ అధికారిణి తదతరులున్నారు.

ఇంద్రవెల్లికి తరలిన కాంగ్రెస్ నేతలు



భిక్కనూరు : ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు భిక్కనూరు కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఎంపీపీ గాలిరెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, బీంరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉపాధి హామీ కూలీలకు స్వీట్లు



మద్నూర్(జుక్కల్) : ఉపాధి హామీ పథకం 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం మద్నూర్ పంచాయతీ ప్రత్యేకాధికారి బండివార్ విజయ్ స్వీట్లు పంచిపెట్టారు. ఏపీవో పద్మ, పంచాయతీ కార్యదర్శి సందీప్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

రాజంపేట : నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. శుక్రవారం వాటర్‌డే ను పురస్కరించుకున్ని ఎంపీడీవో కార్యాయం పరిధిలోని మొక్కలకు నీరు పట్టారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. టీఏ రాజు, బ్రహ్మాచారి సీనియర్ అసిస్టెంట్, సూర్య పాల్గొన్నారు.

నాగోబాను దర్శించుకున్న ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): అదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబాను శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దర్శించుకున్నారు. తెలంగాణ పునర్నిర్మాణ సభకు హాజరైన ఎమ్మెల్యే.. నాగోబాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పేస్కేల్ ప్రకటనపై హర్షం



కామారెడ్డి క్రైం : ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపచేస్తునట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడంపై జిల్లాలో పనిచేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఆర్‌డీఓ సాయన్న ఆధ్వర్యంలో వారంతా శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి టౌన్ : విజయవాడలో జరిగిన దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి మూడు ప్రదర్శలను పాల్గొన్నాయి. ఉపాధ్యాయ బోధన విభాగంలో చిన్నమల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, కొండాపూర్, ఉప్పల్‌వాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సింధూజ, బబ్లులు ప్రదర్శనిచ్చారు. ఉత్తమ ప్రాజెక్టులుగా బహుమతులను పొందారని జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన చింతల సురేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వివాహిత..

నాగిరెడ్డిపేట: మండలంలోని ఓ తండాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. గత నెల 30న ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహితను కాపాడిన పోలీసులు

బాల్కొండ: పోచంపాడ్ డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ వివాహితను ముప్కాల్ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన ఓ వివాహిత తన భర్తతో గొడవ పడి శుక్రవారం పోచంపాడ్ డ్యాంలో దూకి ఆత్మహత్యకు యత్నిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన ముప్కాల్ పోలీసులు గుర్తించి ఆమెను కాపాడారు. పీఎస్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.సకాలంలో స్పందించి కాపాడిన కానిస్టేబుల్ సాగర్,ఉమ్మెన పీసీ రమాదేవీలను ఎస్సై భాస్కరా చారి అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్‌లో మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలిస్తుండగా డ్రైవర్లు ఇసుకను రోడ్డుపై వేసేసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించారు. వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

మాజీ సర్పంచ్ భర్త మృతి

నందిపేట్: మండలంలోని లక్కంపల్లి మాజీ సర్పంచ్ మూడ సుమలత భర్త మహేందర్(39) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న మహేందర్ గతంలో హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో అతనిని బీఆర్‌ఎస్ నుండి సస్పెండ్ చేశారు. అనంతరం పార్టీలో చేర్చుకున్నారు. మహేందర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డాల్ఫిన్ బేకరీలో తనిఖీలు



బేకరీ సిబ్బందితో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీని మూడు శాఖల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. బేకరీని అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రెండంతస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన పరికరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిమాపక పరికరాలు అమర్చాలని ఆదేశించారు. ఆర్మూర్ సివిల్ సప్లై నాయబ్ తహసీల్దార్లు వినోద్ కుమార్, శ్రీనివాస్ బేకరీలోని వంటగదిని పరిశీలించగా గృహ వినియోగానికి సంబంధించిన నాలుగు గ్యాస్ సిలిండర్లు పట్టుకుని, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి కేసు నమోదు చేశారు. ఆర్‌ఐ అశోక్ సింగ్ బేకరీలో ఆహార పదార్థాల తయారీ అధ్వానంగా ఉండటంపై దుకాణంలో పని చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంజాయి నిందితుల రిమాండ్

గాంధారి: మండల పరిధిలోని నేరల్ తండాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీఐ స్వప్న, సిబ్బందిపై దాడిచేసి పారిపోయిన నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తండాకు చెందిన దారావత్ రవీందర్, దారావత్ బిచ్యా, దారావత్ మీరాబాయి, బస్సీ జనార్దన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. నేరల్ తండాలో ఎండు గంజాయి ఉండనే సమాచారం మేరకు గత నెల 27న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి తండాలో దాడులు చేశారు. దారావత్ రవీందర్, శ్రీకాంత్ వద్ద కిలో ఎండు గంజాయి లభించింది.

కాగా నిందితులను ఎక్సైజ్ శాఖ జీపులో నిజామాబాద్‌కు తరలిస్తుండగా బస్సీ జనార్దన్ తన కారులో ఎక్సైజ్ వాహనాన్ని వెంబడించి చద్మల్ తండా వద్ద అడ్డుకుని జీపును ధ్వంసం చేసి, ఎక్సైజ్ కానిస్టేబుల్ సెల్‌ను లాక్కొని పరారయ్యాడు. దీంతో ఎక్సైజ్ సీఐ ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించగా మరో నిందితుడు శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో కిడ్నాపర్

- లభించని బాలుడి ఆచూకీ




సల్మాన్, బాలుడిని తీసుకువెళ్తున్న నిందితుడు

ఖలీల్‌వాడి: నగరంలో ఏడేళ్ల బాలుడి కిడ్నాప్ ఘటనపై అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని మాలపల్లికి చెందిన సల్మాన్ జనవరి 30న అదృశ్యమయ్యాడు. ఇంటి సమీపంలో ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. దీంతో బాలుడి ఆచూకీ కోసం కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఒకటవ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాలపల్లిలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా బాలుడు సల్మాన్‌ను స్థానికంగా ఉండే ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి బైక్‌పై తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన వ్యక్తి ఆచూకీ వివరాలను తెలుసుకోగా విజయవాడలో ఉన్న ట్లు గుర్తించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఓ లాడ్జిలో ఉండటంతో సల్మాన్‌ను తీసుకెళ్లిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. లాడ్జిలో ఉన్న వ్యక్తి నుంచి పోలీసులు కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే బాలుడిని ఎక్కడికి తీసుకువెళ్లాడు..? ఏం చేశాడు అనే కోణంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి



భిక్కనూరు : రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు డీలర్లు తప్పనిసరిగా రసీదులివ్వాలని భిక్కనూరు మండల వ్యవసాయాధికారిణి రాధ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ పురుగుమందులు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం మండలంలోని అడివిలింగాల జెడ్పీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

చుక్కాపూర్‌లో సుదర్శన హోమం

మాచారెడ్డి : స్వాతి నక్షత్రం సందర్భంగా శుక్రవారం మండలంలోని చుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుదర్శన నరసింహ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు జూనియర్ అసిస్టెంట్లు, అర్చకులు, ఆలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు మంజూరు చేయాలి



కామారెడ్డి టౌన్ : జిల్లాలోని లబ్దిదారులకు దళిత బంధు మంజూరు చేయాలని జిల్లా దళిత సంఘాల నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగిమోహన్, స్వామి, రవీందర్, నర్సింలు, సుదర్శన్, నర్సింలు పాల్గొన్నారు.